సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 22 । నవంబర్ । 2023



సోమశిలలో 29.313 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 29.313 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 13 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.63,120
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -రూ.5,675
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,845
నవర (8 గ్రా) - రూ.46,760

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.6 /24.1

మంగళవారం గాలిలో తేమ 100 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిశాయి. బుధవారం కూడా జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

మెట్ట పైర్లకు ఊపిరి

గత రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలు అటు డెల్టా, ఇటు మెట్ట ప్రాంతాల రైతులకు ఊరటనిచ్చాయి. వర్షం నారుమడులకు, మెట్ట పంటలకు ఉపయోగకరమని రైతులు చెబుతున్నారు. పలు మెట్ట పంటల సాగుకు ఈ వర్షం ఉపకరిస్తుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- డెల్టా రైతులకు శుభసంకేతాలిచ్చిన వరుణుడు
- నారుమళ్లకు ఢోకాలేదు

నెల్లూరు(దర్గామిట్ట): బంగాళాఖాతంలో ఏర్పడ్డ ద్రోణి ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా జిల్లా తీర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ వర్షం డెల్టా, మెట్ట ప్రాంతాల రైతులకు వరంలా మారింది. మొదటి పంటకు సాగునీరు అందించాల్సిన నేపథ్యంలో ఈ వర్షం ఆశలు రేకెత్తిస్తోంది. జిల్లాలో పొగాకు, మిర్చి, కంది, జొన్న, మిరప తదితర పంటలు పండించే రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. సోమశిల నుంచి పెన్నా డెల్టాకు నారుమడులకు నీరు విడుదల చేసిన నేపథ్యంలో వరుణుడు శుభసంకేతాలిచ్చాడు. నారుమళ్లకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎంతో ఉపకరించనున్నాయి. నెల్లూరు నగరంలో గత రెండు రోజులుగా ముసురు పట్టి వర్షం కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపై వర్షపునీరు నిలిచింది.

జిల్లాలో 33.5 మి.మీ. వర్షపాతం

జిల్లాలో 33.5 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఇందుకూరుపేటలో 157.4 మి.మీ., అత్యల్పంగా సంగంలో 13.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే విడవలూరులో 121.4, నెల్లూరు రూరల్‌లో 107.4, కొడవలూరులో 94.6, నెల్లూరు నగరంలో 90.2, మనుబోలులో 82.6, ముత్తుకూరులో 80.6, టీపీ గూడూరులో 78.2, బుచ్చిరెడ్డిపాళెంలో 66.4, సైదాపురంలో 54.6, వెంకటాచలంలో 53.6, కోవూరులో 48.6, పొదలకూరులో 40.8, బోగోలులో 40, దగదర్తిలో 37.4, అల్లూరులో 35.2, రాపూరులో 21.6, ఆత్మకూరులో 17.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.



అనంతసాగరం మండలం అగ్రహారంలో సాగులో ఉన్న మిరపపంట

బెట్ట నుంచి బయటపడిన నిమ్మతోటలు

పొదలకూరు: మండలంలో సకాలంలో వర్షాలు కురవక బెట్టకు వచ్చిన నిమ్మతోటలకు బంగాళాఖాతంలో ఏర్పడ్డ ద్రోణి ప్రభావంతో కురిసిన వర్షం ఊరటనిచ్చింది. పొదలకూరు చుట్టుపక్కల రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం నిమ్మతోటలకు మరో నెల రోజుల వరకు ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. బోరుబావులున్న రైతులు నీటి సదుపాయాన్ని బట్టి నార్లు పోసుకున్నారు. రైతులను తొందరపడి నార్లు పోసుకోవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నవంబర్ నెలలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆశలు పెట్టుకున్న రైతులకు కొంత ఊరట లభించింది.



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

వర్షం అనుకూలం

మినుము పంట సాగుకు సమయం లేనందున ఈ నెలాఖరు వరకు పెసర, నువ్వు పంటల సాగుకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని ఏఓ వాసు తెలిపారు. నేలలు ఆరిన తర్వాత రైతులు విత్తనాలను విత్తుకోవాల్సిందిగా సూచించారు. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా 100 క్వింటాళ్ల పెసర విత్తనాలు రైతులకు 30 శాతం సబ్సిడీపై అందించామన్నారు. మండలంలో పెన్నా డెల్టా పరిధిలో 4 వేల ఎకరాల వరిసాగు చేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారని, మిగిలిన చోట్ల బోర్ల కింద మరో 4 వేల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉందని తెలిపారు. డిసెంబర్‌లో కూడా వరుణుడు కరుణిస్తే వరినార్లు పోసుకోవచ్చని తెలిపారు.

వర్షపునీరు నిలవకుండా చర్యలు

- మేయర్ స్రవంతి జయవర్ధన్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతమైన స్థానిక 38వ డివిజన్, మద్రాస్‌బస్టాండ్ సమీపంలోని పొనకాకనకమ్మ బాలికల పాఠశాల, సంక్షేమ వసతి గృహంలో చేరిన వర్షపునీటిని యుద్ధప్రాతిపదికన తొలగించి విద్యార్థినులకు అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ అధికారులను ఆదేశించారు. ఆ పాఠశాల, సంక్షేమ వసతి గృహ ప్రాంగణాన్ని స్థానిక కార్పొరేటర్ దాసరి అమృత, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతిగృహంలో ప్రస్తుతం 50 మంది వరకు విద్యార్థినులు ఉంటున్నారని, గత 2 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాంగణమంతా వర్షపునీరు చేరినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వసతిగృహానికి అనుసంధానంగా ఉన్న డ్రెయిన్ స్తంభించడంతో వర్షపునీరు ప్రాంగణంలోకి వచ్చాయని స్థానిక కార్పొరేటర్ తెలియజేశారన్నారు. దీంతో వసతిగృహ పరిసరాలను పరిశీలించామని, తాత్కాలిక చర్యల్లో భాగంగా వర్షపునీరు చేరిన ప్రాంతంలో మట్టి తోలించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయనున్నామని తెలిపారు.



పొనకా కనకమ్మ బాలికల పాఠశాలలో నిలిచిన వర్షపునీటిని పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

న్యూస్‌రీల్

డెల్టాకు నీటి విడుదల నిలిపివేత



సోమశిల: సోమశిల జలాశయంలో ప్రస్తుతం 29.300 టీఎంసీలు నీరు ఉండగా, సోమవారం నుంచి నెల్లూరు, బుచ్చి, సంగం ఆయకట్టు ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలాశయంలో నీటి సామర్థ్యం తక్కువగా ఉండడంతో డెల్టాకు నీటి విడుదలను నిలిపివేస్తున్నట్లు జలాశయం ఈఈ దశరథరామిరెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయించిన మేరకు సోమవారం డెల్టాకు నీటిని విడుదల చేశామని, వర్షాలు కురుస్తుండడంతో జలవనరులశాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదలను నిలిపివేశామని తెలిపారు.

న్యాయమూర్తులకు ఉద్యోగోన్నతి

నెల్లూరు(లీగల్): రాష్ట్రవ్యాప్తంగా పలువురు న్యాయమూర్తులకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నెల్లూరు మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.లక్ష్మీనారాయణను పదోన్నతిపై నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఈయన స్థానంలో విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్‌ను నియమించారు. నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేపీ సాయిరామ్ పదోన్నతిపై కృష్ణాజిల్లా విజయవాడ 6వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి పి.చైతన్య పదోన్నతిపై జిల్లాలోని కోవూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు.

రైల్వే డీఎస్పీ బదిలీ

- ఇన్‌చార్జిగా తిరుపతి రైల్వే డీఎస్పీ



డీఎస్పీ మల్లికార్జునరావు

నెల్లూరు(క్రైమ్): పరిపాలన సౌలభ్యంలో భాగంగా నెల్లూరు రైల్వే డీఎస్పీ పి.మల్లికార్జునరావును పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మల్లికార్జునరావు గతేడాది నవంబర్ 13వ తేదీన నెల్లూరు రైల్వే డీఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఏడాదిపాటు సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో తిరుపతి రైల్వే డీఎస్పీ షేక్ షానును ఇన్‌చార్జిగా నియమిస్తూ గుంతకల్ జిల్లా రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి మంగళవారం ఆదేశాలిచ్చారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించండి

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, తల్లులు, ఆరేళ్లలోపు వయస్సు పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సీడీపీఓలు, అసిస్టెంట్ సీడీపీఓలతో కలెక్టర్ సమావేశమై స్త్రీ, శిశు సంక్షేమశాఖ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, తల్లులు, పిల్లల సంక్షేమానికి అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలపై సెక్టార్ వారీగా, ప్రాజెక్ట్ వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా అవసరమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియ నూరు శాతం పూర్తి చేయాలన్నారు. టేక్ హోమ్ రేషన్‌ను ఎఫ్ఆర్ఎస్ ఆన్‌లైన్ విధానంలో కచ్చితంగా అందజేయాలని తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పాల్గొన్నారు.

వేదగిరిలో నేటి నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను బుధవారం నుంచి ఈ నెల 25 వరకు నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలు, హోమాలను నిర్వహించనున్నామని చెప్పారు.

పులికాట్‌కు మహర్దశ



ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- ముఖ్యమంత్రి నిర్ణయాలతో మత్స్యకార రంగంలో సత్ఫలితాలు
- మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు

నెల్లూరు(దర్గామిట్ట): మత్స్యకార రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, మన రాష్ట్రాన్ని బెస్ట్ ఫిషరీస్ స్టేట్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఇందుకు నిదర్శనమని, పులికాట్‌కు త్వరలో మహర్దశ పట్టనుందని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు పేర్కొన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఓఎన్జీసీ పైప్‌లైన్ తవ్వకాలతో జీవనోపాధి కోల్పోయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన మత్స్యకారులకు నష్టపరిహారాన్ని సీఎం బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి వర్చువల్‌గా తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, సుళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కలెక్టర్ హరినారాయణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు రాష్ట్రంలో మత్స్య, ఆక్వా రంగాల అభివృద్ధికి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల జీవన భృతితోపాటు డీజిల్ రాయితీ, మత్స్యకార భరోసా వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. మత్స్యరంగంలో ఏపీ సేవలను గుర్తించిన కేంద్రం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా బెస్ట్ ఫిషరీస్ స్టేట్ అవార్డును గుజరాత్‌లో కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల నుంచి ఆ శాఖ అధికారులు అందుకోవడం గర్వకారణమన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం : సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూళ్లూరుపేట ప్రాంత మత్స్యకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు పులికాట్ ముఖద్వారం పునరుద్ధరణకు శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. డిసెంబర్‌లో ముఖ్యమంత్రి పులికాట్ ముఖద్వారం పూడికతీత పనులు, కాళంగినదిపై బ్రిడ్జి మొదలైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. పులికాట్ ముఖద్వారం పూడికతీత వలన సముద్ర జలాలు పులికాట్ సరస్సులోకి ప్రవేశిస్తాయని, తద్వారా సుమారు 20 వేల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నోసార్లు పులికాట్ ముఖద్వారం పనులను చేపట్టాలని విన్నవించినా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు చెల్లించాల్సిన రూ.4 వేల జీవనభృతిని గత ప్రభుత్వం చెల్లించేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ మొత్తాన్ని రూ.6 వేలకు పెంచాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచి మత్స్యకారులకు అండగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌బాబు, ఎన్‌డీసీసీ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారులు నాగేశ్వరరావు, రంగనాథ్‌బాబు, ఎస్.శ్రీనివాసులు, మెరైన్ జేడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.160 కోట్లతో పూడికతీత : తిరుపతి ఎంపీ గురుమూర్తి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.160 కోట్లతో పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీత పనుల అంకురార్పణకు శ్రీకారం చుట్టారని తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాల పులికాట్ ముఖద్వారం పూడికతీత పనులను మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించాల్సి ఉండగా, వర్షం కారణంగా కార్యక్రమం రద్దయిందన్నారు. డిసెంబర్‌లో ముఖ్యమంత్రి ఈ పనులను ప్రారంభించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పులికాట్ ముఖద్వారం పూడికతీత పనుల వలన మత్స్య సంపద పెరిగి మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సాధించారని తెలిపారు.

ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్స్

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపుల మహిళలు (ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయనున్నామని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ఎంపిక చేసిన ఎస్‌హెచ్‌జీలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. 0.20 సెంట్ల భూమి ఉన్న మహిళలను మండలానికి 10 మందిని ఎంపిక చేయనున్నామని, 365 రోజులు పంట దిగుబడులు వచ్చేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ లోపు అవగాహన కార్యక్రమాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్గానిక్ మార్కెట్లు ఏర్పాటు చేసి ఎస్‌హెచ్‌జీలు పండించిన ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో ఏపీడీ రాజు, డీపీఎం మాలకొండయ్య, డీఎల్‌ఎంపీ మునిరత్నం, ఆర్‌టీసీ రవిచంద్రప్రసాద్, ఎస్ఎఫ్ఏ ఓంకార్, ఎంటీఎస్‌లు శరత్, జగపతిబాబు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(క్రైమ్): మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్నిశాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎన్.హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి మత్తుపదార్థాల సమన్వయ (నార్కోటిక్స్ కోఆర్డినేషన్) కమిటీ సమావేశం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ తన కార్యాలయం నుంచి ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. యువత మత్తు, మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, భావితరాల భవిష్యత్‌పై వీటి ప్రభావం పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పోలీసు, రెవెన్యూ, విద్యా శాఖల అధికారులు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. డార్క్ స్పాట్లు, శివారు ప్రాంతాల్లో నిఘా పెంచడంతోపాటు లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని, హాస్టల్స్‌లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలకు బానిసైన యువతకు డి-ఎడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించాలని, ఈ కేంద్రాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని తెలిపారు. ఆర్టీసీ, రైల్వే రవాణా వ్యవస్థలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, నిషేధిత మత్తుపదార్థాల విక్రయం, నిల్వ, రవాణాపై ఉక్కుపాదం మోపాలని, గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఏఎస్పీ డి.హిమవతి గంజాయి విక్రయ, రవాణాలపై నమోదు చేసిన కేసులు, నిందితుల అరెస్ట్, స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలతోపాటు కట్టడికి తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో 183 డ్రగ్ అబ్యూజ్ ప్రివెన్షన్ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఎన్‌కార్డ్ కమిటీ స్టేక్ హోల్డర్స్ పలు సూచనలు, సలహాలిచ్చారు. సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, డీఎంహెచ్ఓ పెంచలయ్య, కోస్ట్‌గార్డ్ కమాండెంట్, అగ్రికల్చర్ జేడీ, జిల్లా ఎస్సీ వెల్ఫేర్, విద్యాశాఖ, టెరిటోరియల్ ఫారెస్ట్ అధికారి, ఆర్టీఓ, కృష్ణపట్నం పోర్టు సీఐఓ, ఇంటెలిజెన్స్, సబ్ డివిజినల్, సర్కిల్ పోలీసు అధికారులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

పది పరీక్షల ఫీజు గడువు 30 వరకు పెంపు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పరీక్షల ఫీజు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ గంగాభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో వచ్చే నెల 4వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 9వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

పోలీసుస్టేషన్ల అప్‌గ్రేడ్

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, కావలి రూరల్ పోలీసుస్టేషన్లు అప్‌గ్రేడ్ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 45 పోలీసుస్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా అప్‌గ్రేడ్ అయిన బుచ్చిరెడ్డిపాళెం, కావలిరూరల్ పోలీసుస్టేషన్లలో ఇకపై ఇన్‌స్పెక్టర్‌లు ఎస్‌హెచ్ఓలుగా వ్యవహరించనున్నారు.

ఐదు ఇన్‌స్పెక్టర్ పోస్టులు

జిల్లాకు కొత్తగా ఐదు ఇన్‌స్పెక్టర్ పోస్టులు వచ్చాయి. సీసీఎస్, వీఆర్‌లో ఉన్న నాలుగు ఎస్సై పోస్టులను తొలగించారు. వాటికి బదులుగా తాజాగా అప్‌గ్రేడ్ అయిన పోలీసుస్టేషన్లతోపాటు ఎస్‌బీ-2, దిశ-2, సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైమ్ సెల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను కేటాయించారు.

సంక్షేమ పథకాల చాంపియన్ జగనన్న



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : స్వతంత్ర భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సంక్షేమ పథకాల చాంపియన్‌గా నిలిచారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని ఏడో వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు అమలైన లబ్ధిని వివరించేలా బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ఆ పార్టీ కండువా కప్పుకున్న వారికే పథకాలు అందేవని, జగనన్న పాలనలో కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హయాంలో 17వ స్థానంలో ఉన్న విద్యా వ్యవస్థ, సీఎం వైఎస్ జగన్ పాలనలో మూడో స్థానానికి చేరిందన్నారు. కరోనా కష్టకాలంలో అన్ని రాష్ట్రాలకన్నా మిన్నగా అందరికీ మేలు చేశారని తెలిపారు. గతంలో మాదిరిగా మళ్లీ జన్మభూమి కమిటీలు వచ్చి ప్రజలను దోచుకు తినకుండా ఉండాలంటే సీఎంగా జగనే కావాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేదల కడుపు కొట్టేందుకు టీడీపీ, జనసేన కుట్రలు చేస్తున్నాయని ఎమ్మెల్యే మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఆత్మకూరు కలగయ్య, జనిగర్ల మహేంద్ర యాదవ్, పానుగోటి అనూరాధ, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.



కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్‌లో పలు ప్రాంతాలకు చెందిన 250 మంది టీడీపీ మద్దతుదారులు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నేత వైవీ రామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కమల్, సతీష్‌ల సహకారంతో ఖాసీం అతని మిత్రబృందం నగరంలోని ఎంపీ ఆదాల నివాసంలో పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీలో కొత్తగా చేరిన వారు పాతవారితో సమైక్యంగా ఉండాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో తాను ఆయా ప్రాంతాల నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

సమష్టిగా దేవాలయాలను నిర్మించుకోవాలి



వేద పండితుల ఆశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- 58 దేవాలయాలకు నిధుల మంజూరు

ఆత్మకూరు : గ్రామాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా గ్రామస్తులు సమష్టిగా దేవాలయాలను నిర్మించుకోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, నూతన దేవాలయాల నిర్మాణ కమిటీ సభ్యులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 99 దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరైతే అందులో 58 దేవాలయాల నిర్మాణ పనులు ఆత్మకూరుకు దక్కాయని వివరించారు. ఈ విషయంలో చొరవ చూపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మూడు విడతలుగా దేవాలయాల నిర్మాణ పనులకు నిధులు మంజూరవుతాయని తెలిపారు. వచ్చే డిసెంబర్ 21న సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా పలు దేవాలయాల పనులు ప్రారంభించాలని సూచించారు. తొలుత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, ఎంపీపీ కె.వేణుగోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్, పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జెడ్పీటీసీ సభ్యులు పి.రాజేశ్వరమ్మ, పీర్ల పార్థసారథి, ఎంపీపీలు తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పెయ్యాల సంపూర్ణమ్మ, పార్టీ నేతలు రఘునాథరెడ్డి, జి శ్రీనివాసులునాయుడు, సుబ్బిరెడ్డి, కె.రమేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కె.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు సంగం విద్యార్థి



ట్రోఫీ అందుకుంటున్న శివకుమార్

సంగం : మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఉడత శివకుమార్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అన్నారెడ్డిపాళెం పీఎంఆర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన శివకుమార్ మూడో స్థానంలో నిలిచారు. చండీఘర్‌లో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శివకుమార్‌ను పాఠశాల పీఈటీ మహేష్, యశ్వంత్‌తో పాటు హెడ్‌మాస్టర్ లక్ష్మీదేవి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- మహిళకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న రామలక్ష్మమ్మ

దుత్తలూరు : ఆగి ఉన్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ మహిళకు తీవ్రగాయాలైన ఘటన మంగళవారం దుత్తలూరు గ్రామ చెరువు అలుగు చప్టాపై జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. దుత్తలూరుకు చెందిన పలువురు వ్యవసాయ కూలీలు ఆటోలో ఇతర ప్రాంతానికి పనికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వచ్చి ఆటో దిగుతున్న క్రమంలో నెల్లూరు నుంచి పామూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఆటో వైపు రావడంతో కూలీలు పక్కకు వెళ్లిపోయారు. అయితే శేషం రామలక్ష్మమ్మ ఆటో దిగుతున్న సమయంలో బస్సు ఒక్కసారిగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో పాటు కాలు విరిగింది. వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ఆమెను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు సరఫరా చేసేలా చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి

నెల్లూరు(పొగతోట) : గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈఎన్‌సీ మాట్లాడారు. మంచినీటికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. రాబోయే వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రూ.18 కోట్ల నిధులు అందుబాటులోకి వస్తాయని, ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాలకు నీటి నిల్వలను పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. జల్‌జీవన్ మిషన్‌కు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో 4.53 లక్షల ఇళ్లకు తాగునీటి కుళాయిలను బిగించినట్లు తెలిపారు. సీఎం హామీ మేరకు కాలనీల్లోని అన్ని ఇళ్లకు కుళాయిలను బిగించి నీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. డిసెంబర్ 25లోపు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

దేశానికే ఆదర్శంగా ఏపీ పాలన



అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు : ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్న మంగళవారం పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల కంటే మిన్నగా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలో రూ.20 కోట్లకు తగ్గకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నేరుగా వారి ఖాతాల్లోకి సంక్షేమ పథకాల నగదు జమ చేసినట్లు వివరించారు. రామతీర్థంలోనే రూ.18.4 కోట్ల నగదు అందించినట్లు వెల్లడించారు. ఈ నాలుగున్నరేళ్లు కనిపించని ప్రతిపక్ష నేతలు ప్రస్తుతం ప్రజల మధ్యకు వస్తున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైతులను దృష్టిలో ఉంచుకుని రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నీటిని విడుదల చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్షయ్య, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో వ్యక్తికి జైలు శిక్ష

ఉదయగిరి : పట్టణంలో జరిగిన పలుచోరీ కేసుల్లో నిందితుడిగా ఉండి రిమాండ్‌లో ఉన్న వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఉదయగిరి సివిల్ కోర్టు న్యాయమూర్తి అంజయ్య మంగళవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి పట్టణానికి చెందిన మహమ్మద్ ఖాజా మొహిద్దీన్ అలియాస్ కొంద్రు పట్టణంలో ఐదు చోరీ కేసులకు సంబంధించి రిమాండ్‌లో ఉన్నాడన్నారు. అతను చోరీలకు పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు.

దర్గా సిబ్బందిపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజారహమతుల్లా నాయబ్ రసూల్ దర్గాలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న హజరత్తయ్యపై హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు దాడి చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి తరువాత చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. ప్రతిరోజు 9 గంటలకు దర్గాలో ప్రార్థనలు జరిగే సమయంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా ప్రదక్షిణలు చేసేలా దర్గా నిర్వాహకులు ఏర్పాట్లు చేసి ఉండగా హైదరాబాద్ నుంచి దర్గా దర్శనానికి వచ్చిన అయాజుద్దీన్, రఫీ ఉద్దీన్ అనే యువకులు మహిళలు ప్రదక్షిణలు చేసే చోట నిలబడి ఉన్నారు. దీనిని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వారిని అక్కడి నుంచి వెళ్లాలని మందలించగా కోపోద్రిక్తులైన యువకులు సిబ్బంది చేతిలోని కర్రను లాక్కొని అతనిపై దాడికి పాల్పడ్డారు. దీనిని గమనించిన ఈఓ హుస్సేన్ అక్కడికి చేరుకుని సర్ది చెప్పే క్రమంలో వారిపై కూడా తిరగబడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై నరేష్, ఏఎస్సై నజీర్‌బాషాలు ఆ యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి హజరత్తయ్యను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందించారు.

పాతకక్షల నేపథ్యంలో..


నెల్లూరు(క్రైమ్) : పాతకక్షల నేపథ్యంలో వివాహితపై దాడిచేసిన ఘటనలో ఇద్దరు నిందితులపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌కు చెందిన సలోమి ఓ వైద్యశాలలో నర్సుగా పనిచేస్తున్నారు. ఆమెకు అదే ప్రాంతానికి చెందిన నారాయణ, విజయలక్ష్మితో పాతగొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 17వ తేదీన ఆమె తన కుమార్తును తీసుకొచ్చేందుకు స్కూటీపై వెళ్తుండగా ఎన్టీఆర్ నగర్ శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం స్కూల్ సమీపంలో నారాయణ, విజయలక్ష్మి కలిసి ఆమెను అడ్డుకుని కర్రలతో దాడి చేశారు. స్కూటీని ధ్వంసం చేశారు. గాయాలపాలైన బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొంది ఈనెల 20వ తేదీ రాత్రి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: రూ.92
లేయర్ (లైవ్)	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.170
స్కిన్‌లెస్ చికెన్	: రూ.190
లేయర్ చికెన్	: రూ.178

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.8



మోటార్ల చోరీ నిందితుల అరెస్ట్

- రూ.5 లక్షల విలువైన మోటార్లు, టైర్లు స్వాధీనం

ముత్తుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వ్యవసాయ మోటార్లు, లారీల టైర్ల చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి, ముత్తుకూరు, కృష్ణపట్నం ఎస్సైలు శివకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని కోళ్లమిట్ట గ్రామానికి చెందిన నెల్లూరు నారాయణ, తిరుమూరు అశోక్, బావితోపు గ్రామానికి చెందిన పురిణి మహేష్ చెడు అలవాట్లకు బానిసలై చోరీలు చేయడం ప్రారంభించారు. తాళ్లపూడి, చలివేంద్రం, బావితోపు, సుబ్బారెడ్డిపాళెం గ్రామ పొలాల్లోని వ్యవసాయ, ఏరియేటర్ ఆక్వా మోటార్లు అపహరించారు. అలాగే, బావితోపులో 8 లారీటైర్లు, కప్పలదొరువులోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను కూడా చోరీ చేశారు. దీంతో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఒక బృందం గాలింపు చేపట్టగా, కోళ్లమిట్ట వద్ద సంచరిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5 లక్షల విలువ చేసే 22 మోటార్లు, 8 టైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదించడంలో సహకరించిన హెడ్‌కానిస్టేబుల్ పెంచలయ్య, అశోక్‌కుమార్, కానిస్టేబుల్ వెంకటరమణ, వెంకటేశ్వర్లు, నాగార్జున, సుమన్, పెంచలయ్యలను అభినందించి, రివార్డు అందజేశారు.

వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన లక్ష్మి

కోవూరు : మండల పరిధిలోని వేగూరు పల్లిపాళెంలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. వేగూరు పల్లిపాళేనికి చెందిన గండవరపు లక్ష్మి ఐదేళ్ల క్రితం థామస్ అనే యువకుడిని ప్రేమ పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త థామస్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే భర్త గత కొంత కాలంగా పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఎవరూ లేనిసమయంలో లక్ష్మి ఉరివేసుకుని ఉండడంతో స్థానికులు గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. తహసీల్దార్ ఎం.పద్మజ, ఎస్సై రఘునాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తల్లితో మాట్లాడిన కాసేటికే..

వేగూరు పల్లిపాళెంలోని తన తల్లితో ఉదయం 7 గంటలకు లక్ష్మి చివరిగా ఫోన్‌లో మాట్లాడింది. తన భర్త కారణంగా రోజూ వేధింపులకు గురవుతున్నట్లు వాపోయింది. ఇంతలోనే ఇలా ఆత్మహత్య చేసుకుంటుందని అనుకోలేదని మృతురాలి తల్లి ఘటనా స్థలంలో రోదించింది.

బస్సు ఆపలేదంటూ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

ఆత్మకూరు : నెల్లూరు నుంచి ఆత్మకూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు (హైయర్ బస్సు) ఆత్మకూరు మండలంలోని వాశిలి గ్రామంలో స్టాపింగ్ వద్ద ఆపలేదంటూ పలువురు దాడి చేసినట్లు బాధిత డ్రైవర్ ఫిరోజ్‌ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని వివరాల మేరకు.. ఫిరోజ్‌ఖాన్ గత రెండేళ్లుగా హయర్ బస్సులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ బస్సు ఆత్మకూరు–నెల్లూరు మధ్య తిరుగుతుంది. మంగళవారం ఉదయం నెల్లూరుకు వెళ్లి ఆత్మకూరుకు వస్తుండగా వాశిలి వద్ద సుమారు 20 మందికిపైగా ప్రయాణికులు ఉన్న ప్రదేశం నుంచి కొంచెం ముందుకు వెళ్లి బస్సును నిలిపారు. అయితే అప్పటికే బస్సులో 80 మందికిపైగా ప్రయాణికులు ఉన్నారని, వెనుక వస్తున్న బస్సులో రావాలని కండక్టర్ ధనమ్మ ప్రయాణికులకు తెలిపారు. అయితే కొందరు డ్రైవర్ వద్దకు వెళ్లి బస్సు ఆపనందుకు గొడవపడ్డారు. ఈ క్రమంలో డ్రైవర్‌పై దాడి జరిగింది. అయితే డ్రైవర్ దురుసుగా ప్రవర్తించాడని, దీంతో ఘర్షణ చోటు చేసుకుందని గ్రామస్తులు వెల్లడించారు. ఈ విషయమై ఆత్మకూరు పోలీసులకు డ్రైవర్, కండక్టర్, డిపో మేనేజర్ కరీమున్నీసా బేగం ఫిర్యాదు చేశారు.

జీవన ఎరువుల వాడకం ప్రయోజనకరం

కొడవలూరు : వరి పంటకు జీవన ఎరువుల వాడకం ఎంతో ప్రయోజనకరమని ఆత్మ పీడీ దొరసానమ్మ సూచించారు. మండలంలోని బసవాయపాళెంలో జీవన ఎరువుల వాడకంపై మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన ఎరువులతో వరికి భూమి నుంచి అందాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియంలు పుష్కలంగా అందుతాయన్నారు. డీడీఏ శివనారాయణ పాల్గొన్నారు.